క్లుప్తంగా

విద్యుత్ పరికరాలు అందజేత



హెచ్ఎంకు విద్యుత్ పరికరాలు అందజేస్తున్న ఎంఈఓ

కోసిగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు నాడు–నేడు కింద విద్యుత్ పరికరాలు మంజూరైనట్లు మండల విద్యాధికారి మెయినుద్దీన్ తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి వచ్చిన విద్యుత్ పరికరాలను వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు–నేడు కింద 35 పాఠశాలలకు పిక్ప్ బాక్స్, ఎంఎంఎస్ పైప్స్, పీపీఈ పైప్‌లు వచ్చినట్లు తెలిపారు. వాటిని పాఠశాలలకు ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే నాడు–నేడు కింద పెండింగ్‌లో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, సంజన్న, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేద్దాం

పెద్దకడబూరు: అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరగనున్న సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండలం నుంచి సుమారు 10 బస్సులు, 30 వాహనాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారికి శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుదుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు. అలాగే కౌతాళంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

ఉద్యోగుల జేఏసీ ధర్నా



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎన్జీఓస్, ఉద్యోగులు

ఆదోనిరూరల్: ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శనివారం ఆదోనిలో ఏపీఎన్జీఓస్, ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, టీచర్లు, వర్కర్లు, పెన్షనర్లు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీఎన్జీవోస్, ఉద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి, తాలూకా అధ్యక్షుడు రమేష్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 20వ తేదీన 19 డిమాండ్లతో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు యాసీన్‌బాషా, నాయకులు రఘురామయ్య, సునీల్‌రాజ్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు విస్తృత తనిఖీలు చేసి 8 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేశారు. సెబ్ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాల మేరకు శనివారం చిప్పగిరి మండలంలోని నగరడోణ గ్రామంలో సెబ్ పోలీసులు తనిఖీలు చేశారు. గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 8 బాక్సుల (90 ఎంఎల్,768 టెట్రా ప్యాకెట్లు) కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వెల్లడించారు. తనిఖీల్లో పోలీసులు సిబ్బంది మహేష్ రెడ్డి, విజయుడు, చంద్రన్న,విజయ్,చెన్నయ్య, రామలింగమ్మ పాల్గొన్నారు.

ముగిసిన వేలంపాటలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి ఆలయంలో శనివారం తలనీలాల వేలంపాటలు ముగిశాయి. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఆదోని డివిజన్ తనిఖీ అధికారి వెంకటేశులు ఆధ్వర్యంలో నిర్వహించని వేలంపాటలో తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు అనంతపురానికి చెందిన మారెన్న రూ.8,40.600 దక్కించుకున్నారు.

మధ్యాహ్నం.. రుచికరం

- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతగా జగనన్న గోరుముద్ద
- రోజుకో రకమైన వంటకంతో పౌష్టికాహారం వడ్డింపు
- వారానికి ఐదురోజులు కోడిగుడ్డు, చిక్కీ
- ఇష్టంగా తింటున్న విద్యార్థులు



మున్సిపల్ హైస్కూల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల ఆకలి బాధల నుంచి దూరం చేయడంతో పాటు వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో పెను మార్పులను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా జగనన్న గోరుముద్ద పేరుతో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తోంది. రోజువారీ మెనూ మార్పు చేయడం, రుచికరంగా వండుతుండటంతో విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

29,697 మంది విద్యార్థులకు గోరుముద్ద

ఆదోని పట్టణం గ్రామీణ ప్రాంతంలో 108 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలో 29,697 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తోంది. గతంలో అన్నం పప్పుచారు వడ్డించేవారు. అప్పుడప్పుడు చిత్రాన్నం చేసేవారు. వారంలో ఎప్పుడో ఒకసారి గుడ్డు ఇచ్చేవారు. జగనన్న ప్రభుత్వం మధ్యాహ్న భోజనం మెనూలో పలు మార్పులు తీసుకొచ్చి పక్కాగా అమలు చేస్తోంది.

పెరిగిన మెనూ చార్జీలు

ఒక పిల్లవానికి గతంలో 1 నుంచి 5వ తరగతి వరకు రూ.3.59, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ. 6.51 ఇచ్చే వారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వంట ఖర్చులను పెంచి మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందిస్తోంది. ప్రభుత్వం పెంచిన వంట ఖర్చులలో ఒక పిల్లవానికి 1 నుంచి 6వ తరగతి వరకు రూ.5.88, 6 నుంచి 10వ తరగతి వరకు రూ.8.57లకు పెంచింది.

భోజనంతో పాటు చిక్కీ... గుడ్డు

ప్రభుత్వం రోజుకు ఒక రకం భోజనంతో పాటు అదనంగా చిక్కీలు, ఉడకబెట్టిన గుడ్డు, రోజు మార్చి రోజు రాగిజావా వంటివి విద్యార్థులకు అందిస్తున్నారు. గత ప్రభుత్వ అయాంలో పిల్లలకు భోజనాలు పెట్టడానికి వంట ఏజెన్సీ వారు నానా తంటాలు పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వంట ఖర్చులుగాని, వంట చేసేవారికి గౌరవవేతనం ప్రతి నెలా వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి. గతంలో నెలలు తరబడి గౌరవవేతనం కోసం వంట నిర్వాహకులు నిరీక్షించిన సందర్భాలు ఉన్నాయి.

మధ్యాహ్న భోజనం మెనూ ఇలా

సోమవారం: హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు లేదా కురగాయాల పలావ్, కోడి గుడ్డు కూర, చిక్కీ.
మంగళవారం: చింతపండు లేదా నిమ్మకాయ పులిహోర, టమోటా పచ్చడి లేదా దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు.
బుధవారం: కూరగాయల అన్నం, బంగాళదుంప కూర్మ, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
గురువారం: సాంబర్ బాత్, ఉడికించిన గుడ్డు.
శుక్రవారం: అన్నం, ఆకుకూరపప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
శనివారం: ఆకుకూర అన్నం, పప్పుచారు లేదా తీపి పొంగలి.

రుచికరంగా ఉంటుంది



మధ్యాహ్న భోజనం గతంలో కన్నా చాల బాగుంది. రోజు ఒక రకరకమైన అన్నం, పప్పు, కాయగూరలు, ఆకుకూరలతో భోజనాలు చేస్తున్నారు. ఉదయం రాగి జావ, మధ్యాహ్నం భోజనంతో పాటు చిక్కీలు, ఉడకబెట్టిన కోడి గుడ్డు ఇస్తున్నారు. మధాహ్నం ఇంటికి వెళ్ల కుండా అందరం ఇక్కడే భోజనం చేస్తాం.

– సల్మా, పురపాలక ఉన్నత పాఠశాల, ఆదోని

మెనూ ప్రకారం అందిస్తున్నాం



ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నాం. భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోజుకు ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులను వంట నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నాం. వారు విద్యార్థులకు భోజనం వడ్డించే వరకూ అన్ని జాగ్రతలు తీసుకుంటారు. ఏ విద్యార్థి కూడా పౌష్టికాహార లోపంతో బాధపడకూడదని ప్రభుత్వం రోజుకు ఒక రకమైన భోజనం ఇవ్వాలని నిర్ణయించింది.

– అలీమ్ సిద్దిఖీ, హెచ్ఎం నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్

భోజనంలో పలు మార్పులు తీసుకొచ్చారు



పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో పలు మార్పులను తీసుకొచ్చింది. గతంలో పప్పు అన్నం, వారంలో ఒక సారి గుడ్డు ఇచ్చేవారు. ఇప్పుడు వారంలో 5 రోజులు ఉడకబెట్టిన కోడి గుడ్డు, చిక్కీలను ఇస్తున్నారు. రోజు మార్చి రోజు రాగి జావా అందిస్తున్నారు. విద్యార్థులు కూడా చాల ఇష్టంగా భోజనం చేస్తున్నారు.

– వెంకటేశులు, ఉపాధ్యాయుడు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఆదోని

జగనన్న ప్రభుత్వంలో రైతన్నలకు పెద్దపీట



సింగరాజన్న హళ్లి గ్రామ రైతులకు హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం: జగనన్న ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం తన నివాసంలో మండలంలోని సింగరాజన్న హళ్లి గ్రామానికి చెందిన రైతులకు వైఎస్సార్ జగనన్న శాస్వత భూ హక్కు–భూ రక్ష హక్కు పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకూడదని గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట కొనుగోలు వరకు అన్ని సేవలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భూ సరిహద్దులు చూపి శాస్వత హక్కు పత్రాలు అందించారన్నారు. సింగరాజన్న హళ్లి గ్రామంలో 170 మంది లబ్ధిదారులకు శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భీమా రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప

ఆదోనిరూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశాల మేరకు శనివారం ఈవీఎం యంత్రాల పనితీరుపై బీఎల్‌ఓలకు, సెక్టోరల్ ఆఫీసర్‌లకు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో అవగాహన కల్పించారు. డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప మాట్లాడుతూ నియోజకవర్గంలోని 256 పోలింగ్ కేంద్రాలకు గానూ విడతల వారీగా 47వ పోలింగ్ కేంద్రం నుంచి 97వ పోలింగ్ కేంద్రంలో ఉన్న బీఎల్‌వోలకు, సెక్టోరల్ ఆఫీసర్లకు ఈవీయంల పనితీరుపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ సహాయకులు ఖాసీం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులందరికీ టీకాలు వేయించాలి



చిన్నారికి సిరప్ అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం జొహరాపురం పరిధిలోని ఏపీ హౌసింగ్‌బోర్డ్ కాలనీ సచివాలయం, యూపీహెచ్‌సీ ముజఫర్‌నగర్ పరిధిలోని సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాల ఉపయోగాలను తల్లులకు తెలిపారు. బర్త్‌ప్లానింగ్‌లో భాగంగా గర్భిణులను ప్రసవం కోసం ఈడీడీ డేట్(డెలివరి)కి 45 రోజుల ముందు ఏ ఆసుపత్రికి వెళ్లాలనేది ఆ గర్భవతి కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి హాస్పిటల్ గురించి అవగాహన కలిగించాలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమయ్యేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తీవ్ర రక్తహీనత కలిగిన గర్భిణులను ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సేవలు ఉపయోగించుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన గర్భిణులకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్–ఎ సిరప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రియ, డీపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాల మార్పు



వివిధ పార్టీల నేతలతో మాట్లాడుతున్న తహసీల్దార్

కౌతాళం: అభ్యంతరాలు ఉన్న పోలింగ్ కేంద్రాలను మార్పు చేసినట్లు తహసీల్దార్ అలెగ్జాండర్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో వివిధ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో మార్పు చేసిన పోలింగ్ కేంద్రాల గురించి వారికి వివరించారు. మండల కేంద్రమైన కౌతాళంలోని కన్నడ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 164వ పోలింగ్ కేంద్రాన్ని జెడ్పీ పాఠశాలలో మార్పు చేసినట్లు తెలిపారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 167వ పోలింగ్ కేంద్రాన్ని సైతం జెడ్పీ పాఠశాలకు మార్పు చేశామని, మండల పరిధిలోని ఉరుకుంద అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్న 146వ పోలింగ్ కేంద్రాన్ని అక్కడే జెడ్పీ పాఠశాలకు మార్పు చేసినట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలందరూ సహకారం అందించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దమ్మవ్వ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పెద్దమ్మవ్వ ఆలయం

ఆదోనిరూరల్: మండలంలోని చిన్నపెండేకల్ గ్రామంలో పెద్దమ్మవ్వ నూతన ఆలయ ప్రారంభోత్సవానికి గ్రామపెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం అమ్మవారి ఆలయాన్ని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పెద్దమ్మవ్వ పేరుగాంచారని, అవ్వవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పెద్దమ్మవ్వ ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను శ్రీశైల దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండితుడు బుట్టే వీరభద్ర దైవాజ్ఞ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సయ్యద్‌గౌస్‌బాషాకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలకు చెందిన పేదలు రోడ్డు ప్రమాదాలకు గురైన, కిడ్నీలు, ఊపిరితిత్తులు దెబ్బతిని అనారోగ్యానికి గురైన బాధితులను ప్రభుత్వం భరోసానిస్తూ ఆదుకుంటోందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎవరికి ఏ జబ్బు చేసినా కార్పొరేట్ ఆస్పత్రుల్లో పైసా ఖర్చు లేకున్నా మెరుగైన వైద్యం పొందవచ్చన్నారు. శనివారం ఎమ్మెల్యే నివాసం ఆవరణలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధితులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేశారు.

కిడ్నీ బాధితుడికి రూ.10 లక్షల చెక్కు

పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన విజయమోహన్‌రెడ్డి కొంతకాలంగా కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యంకోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే సిఫారసుతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.10 లక్షలు మంజూరు కాగా, శనివారం బాధితుడికి చెక్కును అందజేశారు. దీంతో బాధితుడితో పాటు వారి కుటుంబ సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాద బాధితుతులకు..

– రోడ్డు ప్రమాద బాధితుడికి ఆదోని మండలం సాంబగల్ గ్రామానికి చెందిన సయ్యద్‌గౌస్ బాషాకు మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో వైద్యం చేయించుకున్నాడు. అయితే విషయాన్ని గ్రామప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సయ్యద్‌గౌస్‌బాషాను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫారసు చేశారు. ఈమేరకు కింద మంజూరైన రూ.లక్ష చెక్కును అందజేశారు. అలాగే ఆదోని పట్టణంలోని కార్వన్‌పేటకు చెందిన బోయ శ్రీనివాసులు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందాడు. సమాచారాన్ని స్థానిక పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.3 లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును బాధితుడితో పాటు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యుత్ షాక్ గురైన బాధితుడికి రూ.2 లక్షలు అందజేత

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన కాపు వీరేష్‌గౌడ్ విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించేందుకు, నాణ్యమైన వైద్యం పొందేందుకుగానూ సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు రూ.2 లక్షలు చెక్కును బాధితుడికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎమ్మెల్యే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పదోన్నతులు కల్పించాలి

ఆదోని సెంట్రల్: లైబ్రరీయన్స్, పీడీలకు పదోన్నతులు కల్పించాలని లైబ్రరీ సైన్సు అధ్యాపకుల సంఘం సభ్యులు గోవిందరాలు శనివారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 8వ తారీఖున లైబ్రరీయన్స్ , పీడీలకు పదోన్నతులు ఇస్తున్నట్లు జీఓ నంబర్.76లో ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే ఈ విషయంపై జూనియర్ అధ్యాపకులు అభ్యంతరాలను ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. లైబ్రరీయన్స్ హైకోర్టును ఆశ్రయించి ఇంటరీమ్ ఆర్డర్స్ తెచ్చినా జూనియర్ అధ్యాపకులు తమ పలుకుబడి ఉపయోగించి పదోన్నతుల లీస్టు నుంచి లైబ్రరీయన్స్‌ను తొలగించడం దారుణమన్నారు. అనేక మంది లైబ్రరీయన్స్ 35 సంవత్సరాలు పనిచేసిన పదోన్నతులు లేక అలాగే ఉన్నారని తెలిపారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రభుత్వం ఇచ్చిన జీఓలకు అనుగుణంగా పదోన్నతులను కల్పించాలని కోరారు.

కోడుమూరు–గూడూరు రోడ్డు పనుల పరిశీలన

గూడూరు రూరల్: కోడుమూరు నుంచి చనుగొండ్ల మీదుగా గూడూరు వరకు చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్డు పనులను శనివారం ఎంపీపీ సునీత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ మార్గంలో మూడు దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బస్సులు, ఆటోలు తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఊర్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ కృషి కారణంగా రోడ్డు పనులకు మోక్షం లభించిందని చెప్పారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్ల తొలగింపు పనులు జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే పూర్తి స్థాయిలో పనులు జరిపి పూర్తి చేస్తామని, ప్రజలకు రవాణ కష్టాలను తీర్చుతామని పేర్కొన్నారు.

తక్కువ ధరలకే నాణ్యమైన ఔషధాలు



జన ఔషధి కేంద్రం ప్రారంభంలో నాయకులు

పెద్దకడబూరు: అతి తక్కువ ధరలకే ప్రజలకు కావాల్సిన నాణ్యమైన ఔషధాలు జన ఔషధి కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని సింగిల్‌విండో అధ్యక్షుడు బాపురం హనుమంతరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా అతి తక్కువ ధరలకే ఇక్కడ ఔషధాలు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఒకరి కోసం అందరు, అందరి కోసం ఒకరు అనే నినాదంతో సాగుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కేంద్రంలో 1759 రకాల నాణ్యమైన ఔషధాలు దొరుకుతాయన్నారు. వీటితో పాటు 280 రకాల సర్జికల్ పరికరాలు అందుబాటులో ఉంటాయన్నారు. దాదాపు 50 నుంచి 90 శాతం రాయితీతో అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్‌భాస్కర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నాయకులు రామలింగారెడ్డి, బ్రహ్మయ్యచారి, అర్లప్ప, ముక్కరన్న, సొసైటీ డైరెక్టర్ అబ్రహం, ఫార్మాసిస్ట్ విశ్వ తారాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి మారెమ్మ దేవర



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో 9 ఏళ్ల తర్వాత జరుగుతున్న మారెమ్మ దేవరను గ్రామస్తుల సహకారంతో ఘనంగా జరుపుకుందామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీలు కోరారు. మార్చి 12,13వ తేదీల్లో జరిగే ఉత్సవ నిర్వహణపై శనివారం రాత్రి మారికాంబదేవి దేవాలయం వద్ద సమావేశం నిర్వహించారు. దేవర నిర్వహణ కోసం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ క్రీర్తి శేషులు దేశాయికృష్ణ జ్ఞాపకార్థం రూ.6.50 లక్షలను కమిటీ నిర్వహకులు రాఘవేంద్రరెడ్డి, పూజారిలింగన్న, వీరేష్‌లకు విరాళంగా అందజేశారు. ధర్మకర్త మున్నపాషా మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతి నెలకొల్పడానికే ఇలాంటి ఉత్సవాలు ఎంతో అవసరమన్నారు. ఈ ఉత్సవానికి ప్రతి వ్యక్తి తమ వంతుగా సహకారం అందించాలని కోరారు. సర్పంచ్ పాల్‌దినకర్ మాట్లాడుతూ.. ఉత్సవం సందర్భంగా పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. 15వ తేదీ ఎండ్ల బండి పోటీలు ఉంటాయని.. అదే రోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు పాతప్ప కుంభోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, మాజీ సర్పంచ్ అవతారం, నాయకులు దాట్ల సుబ్బారాజు, అబ్దుల్‌సమద్, ఉప సర్పంచ్ తిక్కయ్య, వడ్డెరాము, ఉమపతి, మూకయ్య పాల్గొన్నారు.

19న గుండ్లకొండలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో సీతారాముల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 19న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీ లు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు శనివారం తెలిపారు. మొదటి ఆరు స్థానాల విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10వేలు, రూ.5 వేలు, రూ.3 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమా దు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 93810 68826, 6302871896లను సంప్రదించాలన్నారు.

23న చిట్యాలలో ..

కృష్ణగిరి: లాలు స్వామి ఉరుసు సందర్భంగా మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో ఈ నెల 23న అంతర్రాష్ట్ర బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తాత ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. మొదటి ఐదు స్థానాల విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు బహుమతులు, బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్‌కు 3 తులాల వెండి పథకం అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమాదు చేసుకోవాలన్నారు. వివరాలకు 7702354267, 85559 04658, 8074449192 నంబర్లను సంప్రదించాలన్నారు.